క్లుప్తంగా

యువత పెడదారిన పడకుండా చూడాలి



ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : గ్రామాల్లో గంజాయి విక్రయాలపై సమాచారం అందించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. శనివారం ఆయన పలువురు ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. యువత పెడదారిన పడకుండా ఉండేందుకు ప్రజా ప్రతినిధులు కూడా సహకరించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, గ్రామాల్లో తగాదాలు స్థానికంగా పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. పేకాట, కోడి పందాలాటలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, బీశెట్టి గంగప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీశెట్టి దనశ్రీను, కోన అప్పలరాజు సమావేశంలో పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి 19న శంకుస్థాపన



కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కోరారు. ఈనెల 19న మునగపాకలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనకు సంబంధించి పోస్టర్లను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్‌పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్...



అనారోగ్యంతో బాధపడుతున్న అప్పల నరసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

మునగపాక : తిమ్మరాజుపేటకు చెందిన వలంటీర్ కిల్లాడ మాధవి తన మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన మునగపాక అప్పలనరసమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ దోసూరులో ఉంటున్న కూతురు వద్ద ఆశ్రయం పొందుతుంది. దీనిలో భాగంగా ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛను రూ.3వేలను శనివారం అప్పలనరసమ్మకు వలంటీర్ మాధవి అందజేశారు.

రెవెన్యూ సిబ్బంది ఆవేదన



నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

ఎస్.రాయవరం : విశాఖలోని కొమ్మాదిలో తహసీల్దార్ రమణయ్య హత్యకు గురికావడం రెవెన్యూ సిబ్బందిని తీవ్రంగా కలచివేసిందని మండల ఇన్‌చార్జి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ అన్నారు. ఈ ఘటనపై శనివారం రెవెన్యూ సిబ్బంది నిరసన తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి దారుణాలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారులకు రక్షణ కల్పించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది మౌనం పాటించారు.

ఘనంగా కృష్ణాంజనేయ తీర్థం

రాంబిల్లి : గోవిందపాలెంలో శనివారం కృష్ణాంజనేయ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీకృష్ణుడు, ఆంజనేయస్వామి వార్లను దర్శించుకొని పూజలు చేసారు. భజనలు, చిడతలు, కోలాటాలు, తప్పెటగుళ్లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక స్వావలంబన

- ఆడపడుచులకు అండగా జగనన్న ప్రభుత్వం
- నాలుగు విడతల్లో నూరు శాతం రుణమాఫీ



నూరుశాతం రుణమాఫీ జరిగిన వెల్చూరు నూకేశ్వరి గ్రూపు మహిళలు

రాంబిల్లి : వైఎస్సార్ ఆసరా మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడింది. పాదయాత్రలో జననేత జగనన్న ఇచ్చిన హామీ శత శాతం అమలు జరిగింది. అధికారంలోకి వచ్చాక డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో నూరుశాతం రుణ మాఫీ చేశారు. దీంతో మహిళలంతా జననేతకు నీరాజనాలు పడుతున్నారు. రాంబిల్లి మండలంలో మొత్తం 1156 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఈ సంఘాలకు చెందిన 12,044 మంది మహిళలకు నాలుగు విడతల్లో రూ.32.28 కోట్లు మేర రుణమాఫీ జరిగింది. తీసుకున్న మొత్తం రుణం మాఫీ కావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన సాయాన్ని మహిళలు పలు రకాలుగా సద్వినియోగం చేసుకున్నారు. వ్యవసాయం, పశు పోషణ, దుకాణాల నిర్వహణ, పిల్లల చదువులు, కుటుంబ పోషణ ఇలా పలు అవసరాలకు ఆసరా సాయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గత వారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఆసరా సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుంది.

నూరు శాతం రుణమాఫీ జరిగింది



వెల్చూరు గ్రామానికి చెందిన నూకేశ్వరి గ్రూపులో 13 మంది సభ్యులున్నారు. రూ.5 లక్షలు అప్పు వుండగా పూర్తిగా రుణమాఫీ జరిగింది. జగనన్న సాయం మరువరానిది. మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని నూరు శాతం రుణమాఫీ చేసిన జగనన్నకు రుణపడి ఉంటాం. –కోరాడ నాగమణి, వెల్చూరు

స్వయం ఉపాధి కల్పించింది



వైఎస్సార్ ఆసరా ఎందరినో ఆదుకుంది. నా లాంటి వారికి ఎందరికో స్వయం ఉపాధిని కల్పించింది. ఆసరా సాయంతో పాటు బ్యాంకు లింకేజి రుణం పొంది కిరాణా దుకాణాన్ని మా స్వగ్రామంలో నడుపుకుంటూ ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నాను. ఇంటి వద్దే ఇప్పుడు ఉపాధి దక్కుతుంది.

– కె.వరలక్ష్మి , కట్టుబోలు

రూ.32.28 కోట్ల రుణమాఫీ



నాలుగు విడతల్లో 12,044 మంది మహిళలకు రూ.32.28 కోట్లు రుణమాఫీ జరిగింది. మండలంలో 17 సచివాలయాల పరిధిలో గల స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా వరంలా మారింది. తీసుకున్న రుణం పూర్తిగా మాఫీ జరిగింది. ఈ సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకున్నారు.

– దాసరి పద్మ, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, రాంబిల్లి

పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లను అందిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్రంలో నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డే అని ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. పెంటకోట గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లను అందించే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇంటి స్థలాల కోసం , సొంత ఇంటి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న పేదలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ఇంటి స్థలం లేని వారిని గుర్తించి, అర్హులందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, పట్టాలు పంపిణీ చేశారు. వారందరికీ ఇంటి నిర్మాణం కోసం గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంటి స్థలం పట్టాలు పొందిన వారందరికీ పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్‌లను కూడా అందించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మనందరం మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో హౌసింగ్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్‌వో రాజేష్ పాల్గొన్నారు.

నేడు వడ్డెర కుల బంధువుల ఆత్మీయ సమావేశం

మునగపాక : అనకాపల్లి పట్టణంలో వడ్డెర కుల బంధువుల ఆత్మీయ సమావేశం ఈ నెల 4న జరుగుతుందని సంఘ ప్రతినిధి కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలోని వివేకానంద ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి వడ్డెర కుల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం హాజరవుతారన్నారు. అలాగే ముఖ్య అతిథులుగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు హాజరవుతారన్నారు. వడ్డెర కుల సభ్యులంతా సమావేశానికి హాజరుకావాలని మోహనరావు కోరారు.

రోడ్డు మరమ్మతులు కోరుతూ సంతకాల సేకరణ

మునగపాక : పూడిమడక రోడ్డును బాగుచేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నాగులాపల్లిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టామని సీపీఎం నాయకులు సదాశివరావు, బ్రహ్మాజీలు తెలిపారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతో సాకారం



గ్రామ సచివాలయం భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు



వెల్‌నెస్ కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

- ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు
- సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల ప్రారంభోత్సవం

ఎస్.రాయవరం : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ మోహన్‌రెడ్డి సాధ్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గుడివాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీపతిరాజు సమకూర్చిన స్థలంలో ఒకే చోట గ్రామ సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలను శనివారం ఇరువురు ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఆధునిక హంగులతో నిర్మాణం చేసిన ఈ భవనాలకు ప్రభుత్వ నిధులతో పాటు శ్రీపతిరాజు సహకారం మరో రూ.25 లక్షలు జోడించి రూ.కోటి రూపాయలకు పైగా వెచ్చి సర్వాంగ సుందరంగా భవనాలను నిర్మాణం చేశారు. వీటికి విద్యుత్ సదుపాయం, ఎయిర్ కండిషన్ కూడా పంచాయతీ నుంచి ఏర్పాటు చేసి అన్ని పనులు ఈ భవనాల్లో సక్రమంగా జరిగేలా చూస్తామని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తలచిన విధంగా గుడివాడ గ్రామంలో మూడు భవనాలు ఒకే చోట నిర్మాణం చేసి ఆకర్షణీయంగా మార్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, వ్యవసాయాధికారి సౌజన్య, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి, సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, వర్మరాజు, రఘునాథ్‌రాజు, జోగుబాబు, వెంకటేశ్వరరావు, అచ్చుత్‌రామరాజు, శ్రీరాములు, బొట్టా రాంబాబు, మామిడి చంటి, పిల్లి వెంకట రమణమూర్తి, మధు వర్మ, రాజా రమేష్ పాల్గొన్నారు.

పడమటమ్మ తీర్థ మహోత్సవం నేడు



కశింకోట : కశింకోటలోని కస్పావీధిలో ప్రసిద్ధి చెందిన పడమటమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ వెలసిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. రాత్రి డ్యాన్స్ హంగామా, జూనియర్ ప్రేమ్‌కుమార్ ఆర్ట్స్ రికార్డింగ్ డ్యాన్స్, రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటుతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పట్టణాభివృద్ధి

- పది రోజుల్లో ఫ్లై వంతెన నిర్మాణం పూర్తి
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- పట్టణంలో రూ.2.50 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, సుకుమారవర్మ, తదితరులు

యలమంచిలి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే యలమంచిలి పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆరు వార్డుల్లో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులకు శిలాఫలకాలను శనివారం ఆయన యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణంలోని ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వార్డు సచివాలయ, భవనాలు, అర్బన్‌హెల్త్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.101 కోట్లతో ఇంటింటికి కుళాయి పనులు చేపడుతున్నామని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన యలమంచిలి కొక్కిరాపల్లి రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణపు పనులను తాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి తన సొంత నిధులు స్వయంగా కేటాయించి పూర్తి చేయించానని తెలిపారు. మరో పది రోజుల్లో పనులు పూర్తవుతాయని, ఫ్లైఓవర్ ప్రారంభం పట్టణ ప్రజల ఆధ్వర్యంలో పండగ వాతావరణంలో జరిపిస్తానని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ పట్టణంలో సీహెచ్‌సీ నిర్మాణం కూడా పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, కౌన్సిలర్లు, కొఠారు కొండబాబు ఓగిబోయిన చిరంజీవి, సత్తిబాబు, కోఆప్షన్ సభ్యులు షేక్‌సయ్యిబీబీ, నర్సింహమూర్తి, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండబాబు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

- తులసీనగర్ సచివాలయం పరిధి వార్డు నంబర్ 05లో తులసీనగర్ నుంచి గవర్నమెంట్ హస్పిటల్ వరకు 450సీసీ సీసీ కాలువ నిర్మాణానికి రూ.19.45 లక్షలు కేటాయించారు.
- ధర్మవరం 9–వార్డు సచివాలయం పరిధిలో సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.22.65 లక్షలతో పనులను ప్రారంభించారు.
- గాంధీనగర్ 12–వసచివాలయం పరిధిలో రూ.17.25లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు, కల్వర్టును ప్రారంభించారు.
- గాంధీనగరం సచివాలయం పరిధి వార్డు నంబర్ 13లో నాగేంద్ర కాలనీ నుంచి 15 వ వార్డు కోర్టుపేట వరకురూ.30లక్షలతో సీసీ కాలువలను ప్రారంభించారు.
- నాగేంద్ర కాలనీలో రూ.20 లక్షలతో ఎంపీ ల్యాండ్స్‌తో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.
- ధర్మవరం వార్డు సచివాలయం పరిధిలో ఉన్న 9,10 వార్డుల్లో రూ.45 లక్షలతో గ్రావెల్ రోడ్డు, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.
- వార్డు నంబర్ 13 భవనం వీధి, కోర్టుపేట, పూర్ణసాయి కాలేజి జంక్షన్, గాంధీనగర్ సందు,కలుపుకొని రూ.90.50 లక్షలతో సీసీ రోడ్డు, కాలువలు, ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు.

మహిళల మద్దతు జగనన్నకే

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి
- పెదపల్లిలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ



పెదపల్లిలో మహిళకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి రూరల్ : భర్తలు ఏ పార్టీ జెండాలు పట్టుకుని తిరిగినా భార్యలు మాత్రం ఆత్మసాక్షి ప్రకారం సీఎం జగన్‌కే జైకొట్టి వైఎస్సార్‌సీపీకే ఓటేస్తారని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సాధికారతకు, అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం ప్రతి ఇంటిని సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్నారన్నారు. అందరికీ మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా మద్దతునివ్వాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు 2.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర మాట్లాడుతూ ఒక్క రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయన్నారు. సంక్షేమ సారథి జగనన్న పాలనలో గ్రామాల్లో వచ్చిన మార్పును ప్రజలంతా గమనించి రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పెదపల్లి వార్డు కౌన్సిలర్ దాసరి చిన్నమ్మలు, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, దుంగా అచ్యుతరావు, బొద్దపు కాశీ, బొద్దపు అప్పారావు, బొద్దపు రమణ, మున్సిపల్ కమిషనర్ కొండలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



తిమ్మాపురంలో పరిచయ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కంబాల జోగులు, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రభుత్వ సంక్షేమ పథకాలే పేదలకు శ్రీరామరక్ష అని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో సైతారుపేట, పి.ధర్మవరం, పెనుగొల్లు, వమ్మవరం, గెడ్డపాలెం, తిమ్మాపురం, గోకులపాడు, బంగారమ్మపాలెం, రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం, గుడివాడ, పెదఉప్పలం, గుర్రాజు గ్రామాల్లో ఇన్‌చార్జ్ ఎమ్మెల్యే కంబాల జోగులు పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పరిచయం చేసుకుని ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయం సాధించడం ఖాయమన్నారు. రాబోయే ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎస్.రాయవరం, పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, గుర్రం నానాజీ, పోచిన నరేష్, మార్కెట్ కమిటీ డైరక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, సర్పంచ్‌లు ధూళి శ్రీనుబాబు, పాలపర్తి పాపారావు, కర్రి సత్యనారాయణ, కోశెట్టి వెంకటరమణ, రత్నం, మల్లే లోవరాజు, చోడిపల్లి శ్రీనువాసరావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, నాగంబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాటిపల్లిలో శిథిల భవనం తొలగింపు



పాక్షికంగా దెబ్బతిన్న కమ్యూనిటీ హాల్‌ను తొలగిస్తున్న దృశ్యం

మునగపాక : పాటిపల్లిలో రామాలయం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత రాత్రి కొంతభాగం కూలిపోయింది. దీంతో ముందు ప్రమాదం జరగకుండా ఉండేందుకు సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. 1980లో అప్పటి పరవాడ శాసనసభ్యుడు బాటం శ్రీరామమూర్తి పాటిపల్లిలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. నిర్మించి ఏళ్లు గడుస్తుండడంతో నేడు శిథిలావస్థకు గురై కొంత భాగం కూలిపోవడంతో ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సర్పంచ్ కృష్ణవేణి తగు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దృష్టికి కమ్యూనిటీ హాల్ విషయం తీసుకువచ్చి కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ కృష్ణవేణి తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ఉత్సవాలకు హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు భక్తులు బారీగా తరలివచ్చారు. గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు తగు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఎస్‌ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

‘ఆడుదాం ఆంధ్రా’లో అచ్యుతాపురం జట్ల ప్రతిభ



జిల్లా స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రాలో ప్రతిభ కనబరిచిన అచ్యుతాపురం క్రీడాకారులు

అచ్యుతాపురం : ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా అచ్యుతాపురం మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో వారి ప్రతిభ కనబరిచారు. ఉప్పవరం సచివాలయం మహిళా విభాగం జట్టు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో రెండో స్థానం సాధించారు. హరిపాలెం సచివాలయం పరిధిలోని పురుషుల జట్టు జిల్లా స్థాయి ఖో–ఖో పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. పూడిమడక సచివాలయం పరిధిలో పురుషుల జట్టు జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మూడో స్థానంలో నిలిచారు. ఈ మేరకు ఆయా జట్ల సభ్యులు రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఎంపికయ్యారని ఎంపీడీవో సురేశ్‌కుమార్ తెలిపారు.

భారీగా మద్యం సీసాలు పట్టివేత

కోటవురట్ల : కొడవటిపూడి గ్రామంలో అక్రమంగా నిలువ చేసిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారంతో పోలీసులు దాడి జరిపిన పుడు గ్రామానికి చెందిన కర్రి అమ్మాజీ అనే మహిళ ఇంట్లో 269 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వాటివిలువ సుమారు రూ.38,280 ఉంటుందని మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.